ఎప్పుడు కూలుతుందో..!



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పాలవలస కాలనీకి సమీపంలో పక్కకు వాలిన స్తంభం. ఫైబర్ నెట్ వైర్ల కోసం వేసిన స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. రొట్టవలస నుంచి పాలవలస వరకు ఫైబర్ కేబుల్ కోసం సిమెంట్ పోల్స్‌ను సంబంధిత కాంట్రాక్టర్ సక్రమంగా ఏర్పాటు చేయలేదు. దీంతో కూలిపోయే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. **- సరుబుజ్జిలి**

రక్షణ కరువు



సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలో చినషళంత్రి చెరువు సమీపంలో కల్వర్ట్ వద్ద రక్షణ గోడ లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణాలు చేస్తున్న వారు ఓవర్ టేక్ చేసే సమయంలో ప్రమాదాల బారీన పడుతున్నారు. ఇటీవల ఓవర్ టేక్ చేసే సమయంలో కారు చెరువులో బోల్తాపడింది. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- సరుబుజ్జిలి**

గోతిలో దిగబడిన లారీ



సారవకోట మండలంలోని అర్లి గ్రామం వద్ద సోమవారం లారీ దిగబడింది. గోవర్ధనపురం నుంచి అర్లికి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల కోసం తారు మిక్స్‌తో వెళ్తున్న భారీ లారీ ఇటీవల జల్ జీవన్ మిషన్‌లో భాగంగా పైపులైన్లు వేసేందుకు తీసిన గోతిలో దిగబడింది. సుమారు గంటన్నర పాటు లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో స్థానికులు స్పందించి ఇతర వాహనాలతో బయటకు తీశారు. **- సారవకోట**

ప్రకృతి ఉత్పత్తుల విక్రయం



పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రొమదల, తీమర యూనిట్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ఐసీఆర్పీలు సోమవారం విక్రయించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, రాగులు వంటివి ఎంపీడీఓ, కోర్టు, సబ్ రిజిస్ట్రార్, సచివాలయం, వ్యవసాయశాఖ కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. **- పాతపట్నం**

క్లుప్తంగా

ప్రథమ చికిత్స కిట్లు వితరణ



హెచ్‌ఎంకు కిట్లను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెడ్డీస్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ప్రథమ చికిత్స కిట్లును సోమవారం అందించారు. ఆటలు ఆడే సమయంలో విద్యార్థులకు దెబ్బలు తగిలితే వెంటనే ప్రాథమిక వైద్యం చేసేందుకు ఈ కిట్లు ఉపయోగంగా ఉంటాయని ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేటర్ హరిచందన అన్నారు. హెచ్‌ఎం కేశవరావు, ఎఫ్‌ఎల్‌ఎన్ ఉపాధ్యాయురాలు దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు ఈశ్వరరావు

పాతపట్నం: దివ్యాంగ చిన్నారులకు రోజూ ఫిజియోథెరపీ చేయాలని ఫిజియోథెరపిస్టు ఎస్.ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలోని భవిత కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెస్టు మాట్లాడుతూ ఇంటి వద్ద క్రమం తప్పకుండా వ్యాయామం ఎలా నిర్వహించాలో తల్లిదండ్రులకు, ఐఈఆర్టీలకు అవగాహన కల్పించారు. సహిత ఉపాధ్యాయురాలు ఇన్నా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యం



చాపరాయిగూడలో అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణారావు

పాతపట్నం: ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యమవుతుందని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు అన్నారు. నవోదయం 2.0లో భాగంగా మండలంలోని బొన్ని, చాపరాయగూడ, పూతికగూడ, కొనంగి గిరిజన గ్రామాల్లో సారా నిర్మూలన ప్రచార రథం ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. సారా క్రయ, విక్రయాలు, రవాణా చేపట్టి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామం కావాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు తాడి సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్‌కు వినతిపత్రం అందజేశారు. పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న క్లోపల్లి శ్రీను కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇటీవల మృతి చెందిన కల్యాణి సింహాచలం కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



జాగిలంతో తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ, సిబ్బంది

హిరమండలం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా హిరమండలం పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ ఎండీ యాసిన్ హిరమండలంలోని అన్ని షాపులను పోలీస్ జాగిలంతో తనిఖీలు చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ తనిఖీలతో వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు జరుగుతున్నాయని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్వరాల్‌మెంట్ ఇంజినీరింగ్ ఉద్యోగాలకు మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు నిర్వహించేందుకు పూర్తి చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. 25న 320 మంది, 26న 320 మంది, 27న 302 మంది అభ్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్ట్, సాయంత్రం 2.30 నుంచి 5 గంటల వరకు సెకెండ్ షిఫ్ట్ పరీక్షలు ఉంటాయన్నారు.

నిరుద్యోగ భృతి.. భ్రాంతియేనా..!

- ఎన్నికల ముందు నిరుద్యోగ భృతిపై విస్తృత ప్రచారం
- అధికారం చేపట్టి పది నెలలు అవుతున్నా ఊసేత్తని కూటమి ప్రభుత్వం
- పథకం అమలుపై రాని విధివిధానాలు
- నరసన్నపేట నియోజకవర్గంలో 18 వేల మందికి పైగా నిరుద్యోగులు



నరసన్నపేట: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగ భృతిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకం అమలు చేస్తామని, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేలు ఇస్తామని ఇంటింటికీ వెళ్లి ఓట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా.. నిరుద్యోగ భృతి ఊసే లేదు. బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

నెరవేర్చని తొలి సంతకం..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజున మొదటి సంతకం చేసిన డీఎస్సీకే ఇప్పటివరకూ దిక్కులేదని నిరుద్యోగులు అంటున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 2 వేలకు పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదరుచూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి వివిధ కోచింగ్ సెంటర్లలో చేరి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం టెట్‌తోనే సరిపెట్టి ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాలు వేస్తోంది. ఇతర ఉద్యోగాలు భర్తీకి కూడా కూటమి సర్కార్ స్పష్టమైన ప్రకటన చేయలేదు. గ్రూప్-2 పరీక్షలు నిర్వహించినా ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో.. ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో దేవుడికే ఎరుక. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని నియోజకవర్గంలోని 18 వేల మందికిపైగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

2014లో మోసం..

2014 ఎన్నికల సమయంలో కూడా ఇలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి రూ.2వేలు ఇస్తామని టీడీపీ నాయకులు హామీ నిచ్చారు. ఆ హామీ నెరవేర్చలేదు. అప్పటిలానే ఈసారి కూడా కూటమి ప్రభుత్వం చేస్తుందనే ఆందోళనలో నిరుద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని, విధివిధానాలు వెల్లడించాలని కోరుతున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. కనీసం ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇప్పటికీ ప్రకటించలేదు. ఓట్లు దండుకోవడానికే హామీలు ఇచ్చారు. నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2014లో చేసినట్లే మళ్లీ మోసం చేస్తామనుకుంటే నిరుద్యోగులు ఈ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉంది.

– ధర్మాన కృష్ణచైతన్య, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు

ఉద్యోగాలను భర్తీ చేయాలి



ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా నిరుద్యోగులకు కల్పించలేదు. డీఎస్సీ అన్నారు అదీ లేదు. మరోవైపు వివిధ శాఖల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయి. భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంలేదు. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి అన్నారు అదీ లేదు. నిరుద్యోగులకు తీరని మోసం జరుగుతుంది.

– కొన్న శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బుచ్చిపేట, నరసన్నపేట మండలం

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నేను ఎంబీఏ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం టార్గెట్‌గా పెట్టుకున్నాను. అనుకున్న విధంగా ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్లు రాకపోవడంతో నిరాశగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తుందని ఆశగా ఉన్నాను. ఈ పథకం కోసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే నిరుద్యోగ భృతి అందించాలి.

– జి.తిరుపతిరావు, బెలమర పోలవలస, పోలాకి మండలం

చెరువు సమస్య పరిష్కరించాలి



ఎంపీడీఓకు ఫిర్యాదు అందజేస్తున్న సుందరాడ గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని సుందరాడ, మాకనాపల్లి గ్రామాల ప్రజలు చెరువులోని నీటి కోసం అధికారులకు సోమవారం పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. సుందరాడ గ్రామానికి చెందిన చాపరాయి చెరువులోని (ఆయకట్టంతా మాకనాపల్లి గ్రామానికి చెందిన రైతులకు చెందినదే) నీటిని మాకనాపల్లి గ్రామస్తులు గత కొంతకాలంగా పంటలు పండించడానికి వినియోగిస్తున్నారు. ఇటివల మాకనాపల్లి రైతులు కొంతమంది ఇంజిన్ల ద్వారా చెరువులోని నీటిని తరలిస్తూ ఉండటంతో సుందరాడ గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువు నుంచి కాలువల ద్వారా పారే నీటిని మాత్రమే వినియోగించుకోవాలని, ఇంజిన్లు వేసి నీటినంతా తోడేస్తే.. తమ గ్రామానికి చెందిన పశువులకు తాగడానికి చుక్కనీరు ఉండదన్నారు. మాకనాపల్లి గ్రామస్తులు పట్టించుకోకుండా నీటిని తోడేస్తున్నారని తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండాకు సోమవారం సుందరాడ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇదే సమస్యను టెక్కలి ఆర్డీఓ దృష్టికి మాకనాపల్లి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని సుందరాడ సర్పంచ్ ఎం.ధర్మారావు కోరారు.

పూడికల తొలగింపు

సారవకోట: మండల కేంద్రంలోని మురుగు నీటి కాలువలు పూడికలతో నిండి పోయాయి అనే వార్త శుక్రవారం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మి సోమవారం స్పందించారు. మురుగు నీటి కాలువలో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. గ్రామమంతా ఇదే పరిస్థితి ఉన్నా మార్కెట్ వీధిలో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేయించారని పలువురు ఆరోపిస్తున్నారు.



కాలువును శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

జలుమూరు: మండల కేంద్రం జలుమూరుతో పాటు తిమడాం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పది పరీక్షలను డీఈఓ ఎస్.తిరుమల చైతన్య పరిశీలించారు. మౌలిక వసతులతోపాటు పరీక్షలు పక్కాగా జరగాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిమడాంలోని గీతాంజలి ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

మెళియాపుట్టి: జిల్లాలోని పలు చోట్ల పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని పత్రికల్లో వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో స్థానిక ఎస్ఐ రమేష్ బాబు తన సిబ్బందితో కలిసి పరీక్ష కేంద్రాలను సోమవారం పరిశీలించారు. మెళియాపుట్టి, చాపర, జిల్లా పరిషత్ పాఠశాలలు, పెద్దమడి బాలికల సంక్షేమ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంఈఓ దేవేంద్రరావు ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

నరసన్నపేట: రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని నరసన్నపేట సీఎస్ డీటీ రామకృష్ణ అన్నారు. మండలంలోని కోమర్తిలో ఈకేవైసీ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. మండలంలో 65,507 యూనిట్లు ఉన్నాయని, వీటిలో 59,206 యూనిట్లకు ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలినవి ఈ నెల 31వ తేదీ లోగా పూర్తిచేయాలన్నారు. గ్రామాల వారీగా డీలర్లకు జాబితాలు పంపించడం జరిగిందన్నారు. డీలర్‌ను సంప్రదించి వేలిముద్రలు వేయాలన్నారు.



కోమర్తిలో ఈకేవైసీని పరిశీలిస్తున్న సీఎస్ డీటీ రామకృష్ణ

కాలువలను శుభ్రం చేయాలి



రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపిస్తున్న యువకులు

కొత్తూరు: మండలంలోని నివగాంలో గల ఎల్లమ్మ వీధిలో మురుగు నీటి కాలువలను శుభ్రం చేయాలని ఎంపీడీఓ నీరజకు గ్రామ యువకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల జామియాత్ర నిర్వహించిన సమయంలో కాలువల్లో చెత్త పేరుకుపోయిందన్నారు.

మురుగునీరు వీధి మధ్యలో నుంచి ప్రవహిస్తోందన్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

ద్విచక్ర వాహనంలో పాము కలకలం

నరసన్నపేట: స్థానిక డీసీసీబీ సమీపంలో పార్కింగ్ చేసిన బైక్‌లో పాము చొరబడింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. టైర్ వద్ద కనిపించిన పాము సీట్ లోపలికి వెళ్లిపోయింది. వాహనదారుడు బయపడి మెకానిక్‌ను పిలిపించారు.

ఎంతకీ బయటకు రాకపోవడంతో సీట్ కవరు తొలగించి పామును బయటకు తీశారు. నాగు పాము అనుకొని అందరూ కంగారుపడ్డారు. విషసర్పం కాకపోవడంతో (తుట్ట) ఊపిరి పీల్చుకున్నారు.



సీటు కవర్‌ను తొలగిస్తున్న మెకానిక్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



హిరమండలం: ఉత్పత్తులు, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం: గిరిజనులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని, మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండే ఉత్పత్తులను పండించేలా ప్రోత్సహించాలని నాబార్డ్ ఏపీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.త్రిపాఠీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న బ్రెడ్స్ కార్యాలయంలో గిరిజన రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సాగు విధానాలను గిరిజన రైతులకు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఐదేళ్లల్లో జీవన విధానంలో మార్పులు తీసుకురావాలన్నారు. నాబార్డ్ జిల్లా డీడీఎం రమేష్ కృష్ణ, బ్రెడ్స్ సీఈఓ రామకృష్ణరాజు, రంకిణి, ఇల్లయ్యపురం, కొత్తపేట గిరిజన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిశీలన..

హిరమండలం: స్థానిక విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను నాబార్డు డీజీఎం త్రిపాఠి, జిల్లా మేనేజర్ రమేష్ కృష్ణ పరిశీలించారు. గత కొద్దిరోజులుగా గ్రీన్‌బర్డ్ రైతు ఉత్పత్తులను రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో నాబార్డుపరంగా తనిఖీలు చేపట్టారు. ఉత్పత్తులను, పసుపు, చింతపండు ఉత్పత్తుల ప్యాకింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉద్దండరావు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

పొందూరు: ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఆదర్శ పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్నారనే ఆరోపణలతో 15 మంది ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ డీఈఓ తిరుమల చైతన్య సస్పెండ్ చేయడంపై సోమవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మజ్జిలిపేటలోని పాఠశాల వద్ద భోజన విరామం సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. మాస్ కాపీయింగ్ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపాలని, ఉపాధ్యాయులపై సస్పెన్షన్స్‌ను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు.



మజ్జిలిపేటలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోండి

పొందూరు: మండలంలోని బాణాం పంచాయతీ పరిధిలోని తానెం గ్రామ సరిహద్దులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, పనులు నిలుపుదల చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌లో సర్పంచ్ ఎ.రాంబాబు సోమవారం వినతిపత్రం అందించారు. గ్రామసభ, పంచాయతీ అనుమతులు, తీర్మానాలు లేకుండా సీసీ రోడ్డు పనులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల స్వార్థప్రయోజనాలకు, రియల్ ఎస్టేట్ భూముల అమ్మకం కోసం అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి రూ.38 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నారన్నారు. జనావాసాలకు ఉపయోగం లేనప్పటికీ సీసీ రోడ్డు పనులు జరుగుతుండటంతో వాటిని నిలుపుదల చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు

క్షయపై అవగాహన

జలుమూరు: అవగాహనతోపాటు జాగ్రత్తలు తీసుకుంటే క్షయ వ్యాధి నివారణ సాధ్యమేనని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్నలక్ష్మి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూడు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గడం, బరువు కోల్పోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇతరులకు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ ఎస్.పద్మావతి, పీహెచ్‌ఎన్ రాజ్యలక్ష్మి, హెచ్‌వీ కె.లలితాంబ, హెచ్‌ఎస్ యు.చిన్నరాజులు, ఎల్‌టీ రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పరామర్శ..



పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రెండో వార్డులో గల కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సనపల రాజు తల్లి వైకుంఠమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఆయనతోపాటు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

హిరమండలం: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మండలానికి స్ప్రేయర్లతోపాటు పలు పరికరాలు మంజూరైనట్లు ఏఓ బి.సంధ్య సోమవారం తెలిపారు. బ్యాటరీతోపాటు పవర్ స్ప్రేయర్లు రాయితీపై అందజేయనున్నట్లు చెప్పారు. తొలి విడతలో భాగంగా 30 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 50 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. ఒక రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్లు, నొళ్ల సెటిలు 13 మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ: మండలంలోని సీఎస్పీ రోడ్డు నుంచి నెల్లిపర్తి వరకు రూ.20 కోట్లతో 10 కిలో మీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. బూర్జ నుంచి గిరడపేట వరకు రూ.3.50 కోట్లతో కిలో మీటరు మేర చేపట్టే పనులకు శంకుస్థాపన చేపట్టారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.